సాక్షి నిర్మల్

బుధవారం ▪ 4 ▪ డిసెంబర్ ▪ 2024



కూరగాయల సాగుతో లాభాలు

మూస పద్ధతిలో సంప్రదాయ పంటలు పండించకుండా.. కూరగాయలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు ముధోల్ మండలంలోని తరోడా గ్రామ రైతులు. 9లో▸

దరఖాస్తుల ఆహ్వానం

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్, 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు హిందీ సబ్జెక్టు బోధించేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుమలత తెలిపారు. మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హతగల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో బుధవారం పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 79950 10575 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గరిష్టం/కనిష్టం
29.5 /22.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. తుపాను ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: మహిళలు స్వయం ఉపాధిరంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గా మహిళా శక్తి క్యాంటీన్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు స్వయం ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, మెప్మా పీడీ సుభాష్, ఎల్‌డీఎం రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణకు కృషి



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో వేణుగోపాల్

కుంటాల: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్వో వేణుగోపాల్ అన్నారు. మండలంలోని అంబుగామ, మెదన్‌పూర్, రాజాపూర్ తండాలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై మంగళవారం అవగాహన కల్పించారు. అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లేవారు నిప్పు పెట్టడంతో వన్యప్రాణులతోపాటు మానవాళికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అడవులను కాపాడి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవోలు హరిలత, ముస్తాక్, మహేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాంకులో నాగుపాము



పాముతో ఫయాజ్

బాసర: బాసరలోని ఎస్‌బీఐలో మంగళవారం నాగుపాము ప్రత్యక్షమైంది. సుమారు గంటసేపు బ్యాంకులో అటూఇటు తిరుగుతూ హల్‌చల్ సృష్టించింది. ప్రధాన రోడ్డుపై నుంచి బ్యాంకులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా ఖాతాదారులు పరుగులు పెట్టారు. బ్యాంక్ మేనేజర్ అశోక్ కుమార్ పాములు పట్టే వ్యక్తి ఫయాజ్‌ను పిలిపించగా, అతను పామును పట్టుకున్నాడు. అనంతరం అటవీ ప్రాంతంలో నాగుపాము వదిలేశాడు.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో డాక్టర్ సాప పండరి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన–ఆత్మహత్యల నియంత్రణపై అనే అంశంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా ర్యాలీ తీశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, సిగరెట్, గుట్కా, తంబాకు, వైట్నర్, వైన్ వంటి వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణతో గురువులు చెప్పిన విషయాలు నేర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్సై హన్మాండ్లు, హెచ్‌ఎం కిషన్‌రావు, ఎస్‌జేడబ్ల్యూహెచ్ఆర్సీ ఠాగూర్ దత్తుసింగ్, మాటేగాం మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావుపటేల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ అసంపూర్ణం

- నాలుగో విడతలో 6,823 మందికి లబ్ధి
- రైతుల ఖాతాల్లో రూ.69.67 కోట్లు
- ఇంకా మాఫీ కావాల్సిన రైతులు 6,610
- రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణాలపై సందిగ్ధం

వివరాలు..
మొత్తం ఫ్యామిలీ గ్రూప్ ఇన్ అయినవారు 13,433
నాలుగో విడతలో ఫ్యామిలీ గ్రూప్ అయిన వారిలో అర్హులు 6,823
పంపిణీ చేసిన సొమ్ము 69.67 కోట్లు
రుణమాఫీ కావాల్సినవారు 6,610

మూడు విడతల్లో జరిగిన రుణమాఫీ వివరాలు

విడత	రైతులు	జమ చేసిన సొమ్ము (రూ.కోట్లలో..)
మొదటి	29,432	167.74
రెండో	18,729	196.86
మూడో	16,581	224.35



నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఇప్పటికీ అర్హత ఉండి రుణమాఫీ కానివారు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు విడతల్లో 71,565 మంది రైతులకు రూ.658.61 కోట్లు మాఫీ అయ్యాయి. దీని ప్రకారం.. సుమారు 90 శాతం వరకు రుణమాఫీ కాగా.. మరో 10 శాతం మంది అర్హులు రుణ మాఫీ కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రూ.లక్ష లోపు నుంచి మొదలు..

జిల్లాలో బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం విడతల వారీగా మాఫీ చేస్తోంది. తొలుత రూ.లక్ష లోపు రుణాలు ఉన్న వారికి, ఆ తర్వాత రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు, మూడో విడతలో రూ.1.50 నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేసింది. ఈ విడతల్లో మిగిలిన వారికి నాలుగో విడతగా శనివారం నిధులు విడుదల చేసింది.

మాఫీ కాకపోవడానికి కారణాలు..

జిల్లాలో వివిధ కారణాలతో వేలాది మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు. వారంతా ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం.. అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. రేషన్ కార్డు లేకపోవడం, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు కాకపోవడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో రైతుల వివరాలు తప్పుగా ఉండడం తదితర కారణాలతో రుణమాఫీ నిలిచిపోయిందని అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌కు 13 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేపట్టి మరోసారి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నివేదిక ప్రకారం ప్రభుత్వం రైతు పండుగ సందర్భంగా 6,823 మందికి రుణమాఫీ చేసింది. ఇంకా రుణమాఫీ కానివారు 6,610 మంది ఉన్నట్లు సమాచారం.

రూ.2 లక్షల రుణంపై మల్లగుల్లాలు..

ప్రభుత్వం విడుదల చేసిన పంట రుణాల్లో రూ.2 లక్షల వరకు తీసుకున్నవారి పేర్లు జాబితాలో లేవు. రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్నవారు వడ్డీ చెల్లిస్తే రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చాలా మంది రైతులు అప్పు తీసుకుని వడ్డీని బ్యాంకులకు చెల్లించారు. అయినా రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగో విడత జాబితా వెలువడినప్పటి నుంచి వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులకు రైతులు ఫోన్లు చేసి తమ రుణం మాఫీ కాలేదని మొర పెట్టుకుంటున్నారు. కుటుంబం నిర్ధారణ కానివారు, ఆధార్ కార్డులో తప్పులున్నవారు, పంట రుణం తీసుకున్న ఖాతాపై ఓ పేరు, ఆధార్ కార్డుపై మరో పేరు ఉన్నవారు. భర్త పేరిట భూమి ఉంటే భార్య పేరుతో లోన్ తీసుకున్నవారు, కుటుంబ సభ్యుల్లో భార్యాభర్తలు తీసుకున్న రుణాలు, సరైన వివరాలు తేలనివారి పంట రుణాలు మాఫీ కాలేదు.

దివ్యాంగుల హక్కులు పరిరక్షిస్తాం



కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులు

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. పట్టణంలోని టీఎన్జీవో సంఘ భవనంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి రాధికతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో దివ్యాంగులు హాజరయ్యారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల చట్టాలు, వారికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇదివరకే జిల్లాలో అలిమ్‌కో సంస్థ వారి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించి అర్హులైన 868 మంది దివ్యాంగులకు 1,429 ప్రత్యేక పరికరాలు త్వరలోనే అందిస్తామన్నారు. సదరం క్యాంపులు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ బస్ పాస్, సబ్సిడీ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక ర్యాంపు, వీల్‌చైర్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్, జడ్జి

సమాన అవకాశాలు..

సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అనేది సమాజంలో దివ్యాంగులకు సమాన అవకాశాలు, హక్కులు, గౌరవాన్ని అందించే ప్రాముఖ్యమైన అంశమన్నారు. భారతదేశంలో దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 దీనికి బలమైన చట్టబద్ధతను కల్పించిందని తెలిపారు. దివ్యాంగుల హక్కులను పరిరక్షించడానికి వారి జీవిత ప్రమాణాలను మెరుగుపరచడానికి ముఖ్యమైన నిబంధనలు చేయడం జరిగిందన్నారు. ఉద్యోగ, విద్య, పౌరసేవల్లో 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు దివ్యాంగులపై వివక్ష చేయకుండా, వారి హక్కులను పరిరక్షించే విధానాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగులపై సానుకూల దృష్టి, గౌరవం చూపుతూ వారి హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, డీఎస్పీ ప్రభాకర్, ఏసీడీపీవో నాగలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సంక్రాంతికి రైతు భరోసా..!



ప్రజాపాలన విజయోత్సవంలో మాట్లాడుతున్న తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

- రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి
- మేడిపల్లిలో ఘనంగా రైతు పండగ

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో అర్హులైన రైతులకు సంక్రాంతి కానుకగా రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన– ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడిపల్లి రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు పదేళ్లలో చేయని మేలు కేవలం 10 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. రైతులు పండించిన సన్న ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ రైతుపక్షపాత పార్టీ అని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులు, ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. గద్దెనెక్కిన రెండు నెలల్లోనే మహిళలకు, రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రానికి ఇప్పటికే భారీగా అప్పులు ఉన్నా రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు.

జిల్లాలో 72 వేల మందికి రుణమాఫీ..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 72 వేల మంది రైతులకు రుణమాఫీ చేసిందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తెలిపారు. దీనికోసం రూ.658 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికి తప్ప ఎందుకూ పనికి రాలేదన్నారు. 200 లోపు యూనిట్ల ఉచిత కరెంటు, మహిళకు ఉచిత బస్సు లాంటి విజయవంతమైన సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాసులు కాల్చారు. ఇందులో నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, నాయకులు రామేశ్వర్‌రెడ్డి, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంబడి రాజేశ్వర్, కృష్ణవేణి, కుంట పద్మాకర్, సంతోష్, జైసింగ్, కుంట వేణుగోపాల్, అతీక్ అహ్మద్, వాజిద్ అహ్మద్, నాందేడపు చిన్ను తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల సాధనకు న్యాస్

- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు
- రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 పేరిట నిర్వహణ



మోడల్ పరీక్ష రాస్తున్న ప్రభుత్వపాఠశాల విద్యార్థులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించేందుకు జాతీయ స్థాయిలో మూడేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వ ఎన్‌సీఈఆర్టీ జాతీయ సాధన సర్వే(న్యాస్) నిర్వహిస్తోంది. ఈ విద్యాసంవత్సరం పరాఖ్(రాష్ట్రీయ సర్వేక్షణ్–2024) పేరిట పరీక్ష నిర్వహణకు సమాయత్తమవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేందుకు బుధవారం(డిసెంబర్ 4న) న్యాస్ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. న్యాస్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహణ, విద్యార్థులను సిద్ధం చేయాల్సిన తీరుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ అందించారు. ఈ పరీక్షను ప్రాథమిక స్థాయిలో మూడో తరగతి, ప్రాథమికోన్నత స్థాయిలో ఆరో తరగతి, ఉన్నత స్థాయిలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈ మేరకు నాలుగు నెలలుగా ప్రత్యేక బోధనాభ్యసన ప్రక్రియ చేపడుతూ వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే న్యాస్ పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచేందుకు విద్యార్థులకు మోడల్ పరీక్షలు, మాక్ టెస్ట్‌లు మూడుసార్లు నిర్వహించారు.

స్థానం మెరుగుదలకు ప్రయత్నం...

పాఠశాలస్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు సన్నగిల్లుతున్నాయని 2017, 2021 సంవత్సరాల్లో నిర్వహించిన న్యాస్ ఫలితాలు వెల్లడించాయి. జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం మొదటి 20 స్థానాల్లోనూ లేకపోవడంతో ఈసారైనా మంచి ఫలితాలను రాబట్టాలనే లక్ష్యంతో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సైతం 40 శాతంలోపు మాత్రమే ఆశించిన సామర్థ్యాలను సాధిస్తున్నట్లు గత ఫలితాలు తెలియజేస్తున్నాయి. ఈనేపథ్యంలోనే ప్రాథమికస్థాయిలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత స్థాయిలో లిప్ ప్రోగ్రాంలను ప్రవేశపెట్టి అమలుపరుస్తోంది. పాఠశాల విద్యాశాఖ ద్వారా ఉపాధ్యాయులకు, అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఇందులో భాగంగానే జాతీయస్థాయి సాధన సర్వే పరీక్షకు సిద్ధం చేయడంలో భాగంగా మూడు మాదిరి పరీక్షలను ఇప్పటికే నిర్వహించారు. సెప్టెంబర్ 10న, సెప్టెంబర్ 30న, నవంబర్ 8న మాక్ టెస్టులు చేపట్టారు. ఈసారి జాతీయ స్థాయి సాధనా పరీక్షలో రాష్ట్రం స్థానాన్ని మెరుగుపరిచేందుకు కార్యచరణను ఇప్పటికే మొదలుపెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, పంచాయతీరాజ్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని మూడు, ఆరు, తొమ్మిది తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఎంపిక చేసిన పాఠశాలల వారీగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

పరీక్ష సరళి ఇదీ...

జాతీయ సాధన సర్వే పరీక్ష నిర్వహణలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పంచాయతీరాజ్ పాఠశాలలు, కేజీబీవీ, ఆదర్శ గురుకుల పాఠశాలల్లోని 3, 6, 9 తరగతి విద్యార్థులు తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు ఎదుర్కోనున్నారు. మూడో తరగతి విద్యార్థులకు భాష, గణితం, పరిసరాల విజ్ఞానంపై పరీక్ష నిర్వహిస్తారు. 6, 9వ తరగతులకు భాష, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో ప్రశ్నలు ఉంటాయి. ఇవన్నీ బహుళైచ్ఛిక ప్రశ్నలే. 3, 6 తరగతులకు గంటన్నర సమయం, 9 తరగతి విద్యార్థులకు రెండు గంటల సమయం కేటాయించారు.


మంచి ఫలితాలు రాబట్టేలా..



జాతీయస్థాయిలో నిర్వహించే సర్వే పరీక్ష(న్యాస్)ద్వారా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మదిస్తారు. ఈసారి జిల్లాలో మంచి ఫలితాలు రాబట్టేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. ఇందులో భాగంగానే ఉపాధ్యాయులకు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు సైతం తగిన శిక్షణ అందించాం. జిల్లాలో 3, 6, 9వ తరగతులకు చెందిన 12,539 మంది పరీక్షలు రాయనున్నారు.

– పి.రామారావు, డీఈవో

సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కప్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం కప్ పోటీల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర ఇంటింటి సర్వే, ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. సీఎం కప్ క్రీడా పోటీలు మొదట గ్రామస్థాయిలో నిర్వహించి, వాటిలో విజయం సాధించిన వారికి మండల, జిల్లాస్థాయిల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. పోటీల నిర్వహణకు గ్రామాల్లో మైదానాలను గుర్తించి, సిద్ధం చేయాలన్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, టెంట్ సహా సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ గడువును డిసెంబర్ 6 వరకు పొడిగించినట్లు తెలిపారు. క్రీడల్లో అధిక సంఖ్యలో యువత పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ స్థాయిలో నలుగురు సభ్యులతో కూడిన బృందానికి పంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయి, 10 నుంచి 12 వరకు మండలస్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

సర్వే 97.22 శాతం..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 97.22 శాతం పూర్తయిందని, డేటా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, కేజీబీవీ, వసతి గృహాల్లోకి బయటి వ్యక్తులను అనుమతించొద్దని ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీపీవో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, మోహన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి వనభోజనాలు

- ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల మానసికోల్లాసం కోసం వనభోజనాల కార్యక్రమం చేపట్టినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. నిర్మల్ ఆర్టీసీ డిపోలో మంగళవారం కార్తిక వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఒత్తిడి ఎదుర్కొనే ఉద్యోగులకు ఉపశమనం కలిగించాలని వనభోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం బుధవారం కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఒకేరోజు అందరికీ వీలు కాదనే ఉద్దేశంతో రెండు రోజులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్‌కుమార్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



వన భోజనంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

క్లుప్తంగా

బాసరలో మూలనక్షత్ర పూజలు



పూజలో పాల్గొన్న ఈవో, భక్తులు

బాసర: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆలయ వైదిక బృందం ఆధ్వర్యంలో మూలనక్షత్ర పూజలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం ముందుగా సరస్వతీ మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు కుంకుమార్చన, మహా మంత్ర పుష్పం, సరస్వతి అమ్మవారి పారాయణం వంటి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్, వేద పండితులు నవీన్ శర్మ పాల్గొన్నారు.

7 నుంచి డీఎడ్ వెబ్ ఆప్షన్లు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో డీఎడ్‌లో ర్యాంక్‌లు సాధించిన అభ్యర్థులు రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యతను ఎంచుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 9 వరకు వెబ్ ఆప్షన్లు, 13న సీట్ల కేటాయింపు, 13 నుంచి 15 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయడం, 18న స్లైడింగ్, 21 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇదివరకు సర్టిఫికెట్లను పరిశీలించని అభ్యర్థులు 5న సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో 42మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ తదితర కోర్సుల్లో మంగళవారం నిర్వహించిన మొదటి, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 42 మంది విద్యార్థులు డీబార్ అయ్యారు. వరంగల్ జిల్లాలో ఒకరు, ఆదిలాబాద్‌లో 35 మంది, ఖమ్మం జిల్లాలో ఆరుగురు డీబార్ అయినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

ఐచర్ వాహనం బోల్తా



బోల్తా పడిన ఐచర్ వాహనం

భైంసారూరల్(ముధోల్): సిలిండర్ల లోడుతో వెళ్తున్న ఐచర్ వాహనం మంగళవారం మండలంలోని మాటేగాం సమీపంలో బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్‌లోని మైత్రి సిలిండర్ గోదాం నుంచి గ్యాస్ సిలిండర్ల లోడుతో ఐచర్ వాహనం భైంసాకు బయలుదేరింది. మాటేగాం సమీపంలో కోతుల మంద అడ్డురావడంతో డ్రైవర్ నరేశ్ బ్రేకు వేయగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కుకు స్వల్పగాయాలయ్యాయి.

బాల శాస్త్రవేత్తలు భళా..!

- ఇన్‌స్పైర్‌లో విద్యార్థుల ప్రతిభ
- 15 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపిక

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకత, ఆలోచనాశక్తిని వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా నవంబర్ 30, డిసెంబర్ 1న జిల్లాస్థాయిలో వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లాకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన 149 ప్రాజెక్టులను ప్రదర్శించగా 15 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులపై 'సాక్షి' కథనం..



జిల్లా కేంద్రంలో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సురక్షిత కొడవలి..



సురక్షిత కొడవలితో గడ్డి కోస్తున్నప్పుడు సేఫ్టీ సికిల్ స్విచ్ ఆన్‌చేస్తే పాములు రైతు వైపునకు రాకుండా దూరంగా వెళ్లిపోతాయి. టార్చిలైట్ ఆన్‌లో ఉండడం వలన చీకట్లో కూడా రైతులు సురక్షితంగా గడ్డి కోయవచ్చు. ఈ కొడవలి హ్యాండిల్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా ఉంటుంది. ఫస్ట్ ఎయిడ్ మెడిసిన్ పొందటానికి సేఫ్టీ సికిల్ చివర క్యాప్ తెరిస్తే కాటన్, ట్యాబ్లెట్లు కనిపిస్తాయి.

– నందం శరణ్య, జెడ్పీహెచ్ఎస్, ఇంక్లైన్-2, బెల్లంపల్లి

గాలి నుంచి విద్యుత్ ఉత్పత్తి..



గాలినుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రాజెక్టు ముఖ్యఉద్దేశం. ఈపద్ధతిలో పూర్తిగా పర్యావరణ హిత పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. ఇందులో బొగ్గు, పెట్రోలియం వంటి వాటిని కాకుండా కేవలం వాహనాల చలనం వల్ల వచ్చే గాలి వేగంను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడం లక్ష్యం. ఒక పరికరం ద్వారా సుమారు ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు అరవై నుంచి వంద వాట్స్ కరెంట్ ఉత్పత్తి చేయవచ్చు.

– ఆరాధ్య, టీఎస్ఎంఎస్, మంచిర్యాల

ఆటోమెటిక్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం



పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ ఇలా జనసాంద్రత ఎక్కువగా ఉండేచోట టాయిలెట్లు వాటర్ పోయకుండా వెళ్లడం వలన అపరిశుభ్రంగా ఉంటాయి. ఇలాంటి సమస్యలను నివారించేందుకు ఆటోమెటిక్ ఆఫ్డేటెడ్ టాయిలెట్ క్లీనింగ్ సిస్టం రూపొందించారు. డోర్ తెరవగానే ట్యాంక్‌నుంచి నీటిసరఫరా జరిగి టాయిలెట్ శుభ్రం అవుతుంది. ఇలా లోపలికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు డోర్లు ఓపెన్ కావడంతో రెండుసార్లు నీటితో శుభ్రం చేసేందుకు దోహదపడుతుంది.

– శ్రావణ్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్, అన్నారం

ప్రమాదాల నివారణకు..



సాధారణంగా పార్కింగ్ చేసిన వాహనాల కింద జంతువులు పడుకోవడం, చిన్న పిల్లలు ఆడుకుంటూ ఉండటం గమనిస్తూ ఉంటాం. డ్రైవర్ వాహనం ముందుభ, వెనుక భాగం మాత్రమే చూసే వీలుంటుంది. కిందిభాగం చూడలేని పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవిస్తాయి. వాహనం ముందు వైపు కింది భాగంలో ఒక చిన్న కెమెరా అమర్చి డ్రైవర్ ముందుభాగంలో ఉన్న స్క్రీన్‌కు లేదా స్మార్ట్ ఫోన్‌కు అనుసంధానం చేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు నివారించవచ్చు. డ్రైవర్ వాహనం స్విచ్ ఆన్ చేసిన వెంటనే స్క్రీన్‌పై వాహన కిందిభాగం కనిపిస్తుంది. కెమెరాకు ఉన్న చిన్న మోటర్ సాయంతో కెమెరాను రొటేట్ (వాహన 360 డిగ్రీల వ్యూయర్) చేసుకోవడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చు.

– రజనీకాంత్, జెడ్పీహెచ్ఎస్, వేమనపల్లి

ఆల్టర్‌నేట్ ప్రాజెక్టు వాటర్ డ్రైనింగ్ సిస్టమ్



ఒక్కోసారి ప్రాజెక్టు నీటిమట్టం ప్రమాదకరస్థాయిని చేరుకుంటుంది. ఆనీటిని విడుదల చేసేందుకు గేట్లు ఎత్తుతారు. కొన్నిసార్లు అనుకోని పరిస్థితుల్లో గేట్లు జామ్ అయ్యి ఎత్తలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సందర్భాల్లో నీటిని ఏదో విధంగా తోడివేయడం తప్పనిసరి. లేదంటే లోతట్టు ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్రనష్టం వాటిల్లుతుంది. ప్రాణనష్టం, ఆస్తినష్టం నివారించాలనే ఆలోచనతో ఆల్టర్‌నేట్ ప్రాజెక్టు వాటర్ డ్రైనింగ్ సిస్టమ్ రూపొందించారు.

– సాయితేజ, జెడ్పీఎస్ఎస్, జన్నారం

మెట్రో అంబులెన్స్‌తో..



మెట్రో నగరాల్లో ట్రాఫిక్ సమస్య వల్ల అంబులెన్స్ సరైన సమయంలో ఆస్పత్రికి చేరుకోలేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ సమస్యను అధిగవించేందుకు మెట్రో అంబులెన్స్ సర్వీసు ప్రాజెక్టు తయారు చేశాడు. ఈ సర్వీసు మెట్రోలైన్ ఫిల్లర్స్‌ను ఉపయోగించుకుని ఒక ఫిల్లరు నుంచి మరో ఫిల్లర్‌కు రోప్‌వే ద్వారా అనుసంధానించబడుతుంది. ఒక ప్రదేశంలో ఉన్న మెట్రో ఫిల్లర్ పైకి లిఫ్ట్‌సాయంతో ప్రమాదానికి గురైన వ్యక్తిని పంపించి అక్కడి నుంచి రోప్‌వేకి కనెక్ట్ చేయబడిన మెట్రో అంబులెన్స్ ద్వారా మరో ప్రదేశానికి సులువుగా తరలించి మరో లిఫ్ట్ ద్వారా అంబులెన్స్ లేదా సమీపంలోని ఆస్పత్రికి చేర్చడం ప్రాజెక్టు ఉద్దేశం.

– ఇంద్రవర్మ, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఎస్, గుడిపేట్

గడ్డికట్టలు దగ్ధం.. రూ.3 లక్షలు నష్టం

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన పుట్టి సుధీర్, పుట్టి హరీశ్ అనే రైతులు వరి కోతల అనంతరం గడ్డి కట్టలను షెడ్డులో ఉంచారు. సోమవారం అర్ధరాత్రి షెడ్డుపై విద్యుత్ తీగ తెగిపడి మంటలు చెలరేగాయి. దీంతో గడ్డి వాముకు నిప్పంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. సమీపంలో ఉన్న బైక్ మెకానిక్ రైతులకు సమాచారం ఇచ్చారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది ప్రతాపరెడ్డి, నరోత్తం మంటలు ఆర్పేందుకు యత్నించారు. ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకునేసరికి మూడు వేల గడ్డికట్టలు కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు.

వర్షం.. రైతులకు కష్టం

కుంటాల/లక్ష్మణచాంద: కుంటాల మండలంలోని వెంకూర్, అంబకంటి, ఓలా, దౌనెల్లి, కుంటాల గ్రామాల్లో మంగళవారం చిరుజల్లులతో వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో చేన్లలో ఉన్న పత్తి తడిసింది. కల్లాల్లో ఉన్న ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు.



కుంటాలలో ధాన్యం తడవకుండా టర్పాలిన్ కప్పుతున్న రైతులు

లక్ష్మణచాంద మండలంలోనూ మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి.

మెరుగైన విద్య, వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల డీటీడీవో, ఏటీడీవోలను ఆదేశించారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన పోషణ మిత్ర ద్వారా విద్యార్థులకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. అలగే మోవా లడ్డూ సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. స్నానానికి వేడి నీళ్లు ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఏటీడీవోలకు సూచించారు. ఆశ్రమ పాఠశాలలను సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఏటీఎంహెచ్‌వో మనోహర్, డీటీడీవో రమాదేవి, ఉమ్మడి జిల్లాల ఏటీడీవోలు, జీసీడీవోలు, ఏసీఎంవోలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించి సబెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. అనంతరం ఉట్నూర్ మండలంలోని సుక్కతాండ, లంబాడీతండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ప్రేమ పేరుతో వంచించాడని..

- యువతి ఆత్మహత్య
- నిందితుడు బీఆర్ఎస్వీ నేత



సాయిస్నేహిత (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: ప్రేమ పేరుతో వంచనకు గురైన యువతి బలవన్మరణం చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హనుమాన్ బస్తీకి చెందిన జంగపల్లి సాయిస్నేహిత(21), మహ్మద్‌ఖాసీం బస్తీకి చెందిన బీఆర్ఎస్వీ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి శ్రీనాథ్ కొంతకాలంగా ప్రేమించుకున్నారు. యువతి పెళ్లి ప్రస్తావన తీసుకరావడంతో కుటుంబసభ్యులు నిరాకరిస్తున్నారని చెప్పడంతో తీవ్ర వేదనకు గురైంది. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకన్నారు. శ్రీనాథ్ వేధించడంతోనే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. కాగా సాయిస్నేహిత మృతిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదునూరి శ్రీనాథ్‌ను పదవి నుంచి తొలగించినట్లు బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ తెలిపారు.

పూలకోసం వెళ్లి.. శవమై

చెన్నూర్: పూలకోసం వెళ్లిన వ్యక్తి శవమైన వచ్చిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బట్టిగూడెం కాలనీకి చెందిన పందుల రమేశ్ (40), జిట్టవేన రాజబాపు మంగళవారం తామరపూలకోసం పెద్ద చెరువుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగిన రమేశ్ కాలికి తామరచెట్టు వేర్లు చుట్టుకుని అడుగుభాగంలో ఇరుక్కుపోయాడు. గమనించిన రాజబాపు కేకలు వేయగా పలువురు ఈతగాళ్లు చెరువులోకి బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుని భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

ఎస్టీపీపీ జీఎం ఆత్మహత్య



తిరుపతిరావు(ఫైల్)

జైపూర్: 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో నూతనంగా ఎఫ్‌జీడీ నిర్మాణం చేపడుతున్న పీఈఎస్ ఇంజనీరింగ్ సర్వీస్ కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ (జీఎం)గా విధులు నిర్వర్తిస్తున్న బొబ్బా తిరుపతిరావు (అలియాస్ బీటీరావు) (56) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ముస్తాబాద్‌కు చెందిన తిరుపతిరావు రెండేళ్లుగా మూత్రపిండాల సమస్యతో బాధపడుతుండగా ఆపరేషన్ సైతం చేయించుకున్నాడు. ఒక వైపు అనారోగ్యం, మరోవైపు ఒంటరి జీవితం గడుపుతుండడంతో మనస్తాపానికి గురై మంగళవారం తాను నివాసం ఉంటున్న క్వార్టర్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతునికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని సోదరుడు శ్రీనివాస్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. యువ ఇంజనీర్ కిరీటీ ఆత్మహత్య మరువక ముందే మరో అధికారి ఆత్మహత్యకు పాల్పడడం స్థానికులలో ఆందోళన కలిగిస్తోంది.

ప్రాజెక్టులో దూకి ఒకరు ..

ఆసిఫాబాద్‌రూరల్: కుమురం భీం ప్రాజెక్టులో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అడ గ్రామానికి చెందిన భీమయ్య (70) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని కుమురం భీం ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతునికి భార్య రుక్మబాయి, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

మద్యం మత్తులో యువకుడు..

చింతలమానెపల్లి: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గూడెం గ్రామానికి చెందిన మండిగా సాయి (23) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మద్యం మత్తులో ఇంటి సమీపంలోని పెరట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి



చంద్రమౌళి (ఫైల్)

భీమారం: విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామానికి చెందిన పప్పు చంద్రమౌళి (53) భీమారంలోని ఐటీడీఏ కాలనీలో నివసిస్తున్న అతని అల్లుడు రాంటెంకి రంజిత్ కుమార్ ఇంటికి మూడురోజుల క్రితం వచ్చాడు. మంగళవారం ఇటీవల నిర్మించిన భవనంపైకి 20 ఫీట్ల ఇనుపరాడ్ తీసుకెళ్తుండగా పైన ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు రాడ్ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతనికి సహాయం చేస్తున్న పక్కింటికి చెందిన బాలుడు వంశీకృష్ణకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చంద్రమౌళి మృతి చెందాడు. రంజిత్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.